# చిత్రశిల

జలంధర.



అక్కడ... అక్కడ పొగమంచులో ... భారతీయ వీరుడి అంతిమ సంస్కారాల ఏర్పాటు... ఆ చుట్టూ రాళ్లగుట్టలన్నీ పూవులు పూచాయా అన్నట్లు అపరిచితులే ఆత్మీయంగా అందించిన పుష్పగుచ్ఛాలు చెదురు మదురుగా ... ఎక్కడో దూరదేశాన ఉన్న అతని తల్లి కన్నీరు కలిపి పన్నీరు సేవలా కురుస్తోంది సన్నని తెలిమంచు.

అది చిత్రశిల!

ఎవరితను? ఎక్కడివాడు? ఏ ప్రాంతం? ఏ రాష్ట్రం? ఏ కులం? ఏ భాష? అని ... మృత్యువు తన ఒడిలో తలవాల్చిన ఆ వీరకిశోరాన్ని అడగదు.

అతడు నా బిడ్డ... భారతీయుడు అంటూ పులకించిపోతూ తనలో కలుపుకుని పునీతుణ్ణి చేస్తోంది బహురత్న ప్రసవిత భారతమాత.

అతను భరత్!

000

ఇక్కడ...

చాలా కోలాహలంగా ఉన్నది. ఆ పెద్దమేడలో పార్టీ జరుగుతోంది. పక్కా రాజకీయపు బిజినెస్‌కు పండగ కళ అద్ది, మర్యాదల పేరంటం జరుగుతోంది అక్కడ.

పెద్దగా పెట్టిన 'వి' ఛానెల్, ప్లేట్లు, గ్లాసుల చప్పుళ్లు... కేకలు, అరుపులు. సీసా పగిలిన మోత ... ఇల్లంతా లైట్లు ...

కానీ, అదే ఇంట్లో చీకటి వెలుతురు చారికల మధ్యలో గాజు కళ్లతో చూస్తూ కూర్చున్నది ... వింధ్యేశ్వరి.

రానురానూ ఆ అలజడి ఆమె భరించలేకపోతోంది. "ఆపండి!" అని గట్టిగా

అరుద్దామనిపిస్తోంది. కానీ... ఆపి... ఆ తరువాత?!

వివేకం పనిచేసింది. తను అరిస్తే ఏమిటో అనుకుని ఆ హడావుడి ఒక్క క్షణం ఆపుతారు. అంతే! మళ్లీ మరో పది నిముషాల్లో మామూలే! వాళ్లకు తన అలజడి... ఆందోళన అర్థమవ్వాలన్న రూలు ఏమున్నదసలు?

ఆవిడకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. భర్తకు డబ్బు, పలుకుబడి ఉన్నాయి. అందుకని ఎవరి మంచిమాటా వినక్కర్లేదన్న హజమున్నది. పిల్లలకూ అంతే! పెద్దకొడుకుకు లంచాలను చూడందే సూర్యాస్తమయం కాదు. చిన్నవాడు పట్టుబడని రౌడీ షీటర్... ఏ దుర్మార్గానికైనా వెనకాడడు. ఇంక కూతుళ్లు ... ఇల్లాలితనం కింద ఎదుటివాళ్లను ఎద్దేవా చేసే ప్లాస్టిక్ నవ్వుల సీతాకోక చిలుకలు!

ప్రపంచంలో అంతా వీళ్లలాంటివాళ్లే అనుకునేది వింధ్యేశ్వరి ... అతడు... అతడు ఆ ప్రశ్న అడిగేదాకా!

రెండేళ్లక్రితం మూడవవాడు భరత్.

"అమ్మా! మనమంతా సుఖపడుతున్నామంటావా?" సూటిగా చూస్తూ అడిగాడు.

అర్థం కాలేదు ఆమెకు.

"అంటే ఏమంటావురా?" అడిగింది.

"అమ్మా! వీళ్లందరూ... వీళ్లకు ఒక గోల్ లేదు. లక్ష్య సుద్ధి లేదు. ఇలాగే బతకాలన్న రూలు లేదు. ఇది ధర్మం, ఇది కాదు అన్న భయం లేదు. ఎదుటివాళ్లను దుఃఖపెట్టకూడదన్న ఇంగితం లేదు. ఇందులోనుంచి సుఖం ఎలా వస్తుందమ్మా?"

నిర్ఘాంతపోయింది వింధ్యేశ్వరి.

"భరత్! ఏమిట్రా నువ్వనేది?"

"అవునమ్మా! నేను వేరేరకం ప్రపంచాన్ని చూస్తున్నానమ్మా! విలువలు ఉన్న మనుషుల్ని చూస్తున్నాను. కక్కుర్తి, అవినీతి లేని ఉన్నతుల్ని చూస్తున్నాను. ధర్మంకోసం ప్రాణాల్ని పణంగా పెట్టగల గొప్పవాళ్లను చూస్తున్నాను. తను పుట్టిన దేశానికి, తన దేశపు ఆత్మగౌరవానికి ప్రతిరోజూ తలవంచి, గౌరవించే మహోన్నతుల్ని చూస్తున్నాను. వాళ్లను చూసిన తరువాత ... ఈ మన జనాన్ని చూస్తుంటే ఏదో వ్యాధి పుట్టిన వాళ్లలా కనిపిస్తున్నారమ్మా!"

భయపడిపోయింది వింధ్యేశ్వరి. 'వీడు ఏ రివల్యూషనిస్టుగానో మారిపోతున్నాడా?' అని. వీడిమీద వీడి ప్రొఫెసర్ ప్రభావం అతిగా ఉన్నదని ఆచూకీ కనుక్కున్నది.

ఒకరోజు పడవంత కారులో ఆయన ఇంటికి వెళ్లింది నిర్భయంగా. "మా వాడికి పిచ్చిపిచ్చి

ఆ రోజు... తన ఇంట్లో ముప్పై ఏళ్లనుంచీ పనిచేస్తున్న ఆదెమ్మ కూతురు లక్ష్మి పదహారేళ్ల పిల్ల మాయమైపోయింది. వెతకడం, పోలీసు రిపోర్టులు...

అంతా అయినాక శవమై దొరికింది చెరచబడి, హింసపడి. రోజారేకులాంటి పిల్ల నలిగిపోయి...



కబుర్లు చెప్పద్దు! పనికిమాలిన ఆదర్శాలు, గతిలేనివాళ్ల గొప్పలు నేర్పద్దు!" అని ఎడాపెడా దులిపేసింది.

అహంకారంతో కూడిన అజ్ఞానం మనిషికి గొప్ప ధైర్యాన్నిస్తుంది.

"ఏమన్నాడు భరత్?" ఆయన మెల్లగా అడిగాడు.

"ఏమిటో నా పుట్టిన దేశం అంటాడు... ఈ మట్టికి వంగి దణ్ణం పెట్టాలంటాడు. ఏమిటా శ్లోకం ... ఆఁ.... సముద్రవసనేదేవీ అని పద్యాలు పాడేస్తున్నాడు. ఈ సంగతి వాళ్ల నాన్నగారికి తెలిస్తే ఎవరికీ మంచిది కాదు!" స్పష్టంగా చెప్పేసింది.

బయట నలుగురిపై జులుం చెలాయించగల భర్త ఉన్న ఆడదానిలో హజం, ఆమెచేత ఆ మాటలు మాట్లాడించింది.

"ఏది తప్పంటున్నారు మీరు?" సూటిగా చూస్తూ అడిగారు ఆయన.

"అంతా తప్పే!" మొండిగా అన్నది.

కుటుంబవ్యవస్థ కలిగించిన నమ్మకాల మత్తుమందు సేవించిన ఆమెకు 'తనవాళ్లు' ఏం చేసినా రైటే! కళ్లకింద చారలు, ఒంట్లో ఊరిపోతున్న అనారోగ్యానికి పట్టు చీరలు చుట్టి, రవ్వల నగలు పెట్టి దాచాలన్న ఈ ఆత్మవంచనకు పేరేమిటో అసలు?! తనకు ఏమాత్రం నచ్చనివి తన చుట్టూ జరుగుతున్నా.. తెలియనట్లు నటించే జాడ్యంలో ఉన్న మనిషి ఆమె.

"ఏమిటి తప్పు? తన మాతృభూమిని ప్రేమించడమా? ప్రతిరోజూ మన చుట్టూ ప్రపంచం శాంతిగా ఉండాలి, అందర్నీ సమానంగా ప్రేమించాలి అని ప్రార్థించడమా? మన చుట్టూ గాలి, నీరు, భూమి, ఆకాశము, అగ్ని అన్నీ తేజస్సుతోనూ, ఓజస్సుతోనూ వెలుగుతూ శాంతి కలిగించాలని కోరడమా? భరత్‌కు నేను జాతివైరమో, కులపు మత్తో, నేను ఆచరించలేని ఆదర్శమో ... ఎదుటివాళ్లను నిలువునా ముంచగల వంచనో, ఆత్మవంచనో నేను నేర్పించడం లేదే?"

ఆయన మాటల్లో స్పష్టతకు, మంచు ఘనీభవించినట్లున్న పదునుకు వణికిపోయింది వింధ్యేశ్వరి. కానీ, తొణకకుండా, బెణకకుండా "ఆఁ... ఏదో పిల్లవాడు చిన్నవాడని, ఏ దారి పడతాడోనని భయపడ్డానంతేనండీ!" అని సెలవు తీసుకుని వచ్చేసింది.

కానీ, ఆయన మాటలు మరుపు రాలేదు. తమ కులపువాళ్లకు తప్ప తన దగ్గర ఉద్యోగం ఇవ్వడు భర్త. కానీ, వాళ్లే తనను దాటిపోతున్నారని తెలియగానే జాలి లేకుండా అణగదొక్కేస్తాడు. తన మతంలో ఉన్న ఏ గ్రంథంలోని మంచిమాటలమీదా నమ్మకం లేకపోయినా, కలహాలు, కార్చిచ్చులు రేకెత్తించడానికి తమ మతాన్ని ఉపయోగిస్తాడు ఆమె తమ్ముడు. మధ్యాహ్నం పన్నెండుదాకా పూజలు చేసి కానీ మేడ దిగని బావగారు బయటకొచ్చి కమ్యూనిజం మాట్లాడతాడు. తన పెద్దకొడుకు సరే సరి ... డబ్బు వస్తుందంటే దేశాన్ని ముక్కలు ముక్కలుగా అమ్మకానికి పెడతాడు. చిన్నవాడు గాంగ్‌రేప్‌లతో, అధికారం కోసం ముఠా కక్షల చిచ్చుపెడతాడు.

ఇవన్నీ తనకు తెలిసినవే! తన చుట్టూ ఉన్నవే! కానీ తనకు ఎవేర్‌నెస్ ఎందుకు లేదు ఇంతకాలం? ఇది నీతిబాహ్యత అని ఎందుకు అనిపించలేదు? "నా వాళ్లు ఏం చేసినా అది పాపం కాదు!" అనే నీచమంత్రం ఏదో ఉపదేశం చేసిందా ఈ కుటుంబవ్యవస్థ?!

ఆ రోజు... తన ఇంట్లో ముప్పై ఏళ్లనుంచీ పనిచేస్తున్న ఆదెమ్మ కూతురు లక్ష్మి పదహారేళ్ల పిల్ల మాయమైపోయింది. వెతకడం, పోలీసు రిపోర్టులు...

అంతా అయినాక శవమై దొరికింది చెరచబడి, హింసపడి. రోజారేకులాంటి పిల్ల నలిగిపోయి...

కొద్ది దూరంలో ఉన్న ఆదెమ్మ గుడిసెలోంచి ఆలగోలు, బాలగోలు.

గుండెలు చేత్తోపట్టుకుని పడక కుర్చీలో పడుకున్నది వింధ్యేశ్వరి.

"అమ్మా!" ఆ పిలుపుకు ఉలిక్కిపడి లేచింది. ఎదురుగా భరత్.

"నువ్వు ఇప్పుడు ఏం ఆలోచిస్తున్నావో చెప్పనా?" అన్నాడు.

"ఏమిటిరా?" ఆదుర్దాగా అన్నది.

"లక్ష్మికి జరిగిన కిరాతకంలో చిన్నన్నయ్యకు భాగం ఉన్నదేమోనని భయపడుతున్నావు. ఉండకూడదని దేవుళ్లకు మొక్కుతున్నావు, అవునా?"

"భరత్! నోర్ముయ్!" ఒక్క అరుపు అరిచింది.

"అరవకమ్మా! నీకు తెలుసు నేను చెప్పేది నిజమని. అమ్మా! జీవితంలో జరగకూడనిది ఏమిటో తెలుసా? మనందరం తింటూ, తిరుగుతూ, హాయిగా ఉన్నట్లు కనబడుతూ లోలోపల ఏదో చచ్చిపోతున్నట్లు గుర్తించకపోవడం... దేనికీ పద్ధతిగా స్పందించలేకపోవడం... నువ్వు ఇంతమంది బిడ్డల తల్లివి. పైగా, లక్ష్మి మన కళ్లముందర పెరిగింది... ఇప్పుడు నువ్వు న్యాయంగా ఈ అన్యాయం చూసి బాధపడాలి. ఆదెమ్మను ఓదార్చి ఆదుకోవాలి. కానీ, నువ్వేం చేస్తున్నావు? అన్నీ తప్పుతప్పుగా చేస్తున్నావు. దీనికి కారణం? ఇందాక చెప్పానే లోలోపల ఏదో చచ్చిపోవడం. అమ్మా! దయచేసి దాన్ని చచ్చిపోనీయకమ్మా!" అంటూ వెళ్లిపోయాడు.

అవాక్కై అలా కూర్చుండిపోయింది ఆ రోజు.

ఆ తరువాత 'దేశ సేవ' అంటూ సైన్యంలోకి ఎవరి మాటా వినకుండా వెళ్లిపోయాడు భరత్.

భరత్ వెళ్లిపోయిన తరువాత కానీ, తనేం పోగొట్టుకున్నదో, ఎవర్ని పోగొట్టుకున్నదో అర్థం కాలేదు వింధ్యేశ్వరికి.

తన అంతరాత్మ ఆ బిడ్డ ... తనకు ఆలోచించడం నేర్పిన గురువు. అప్పుడప్పుడు వాడి దగ్గరనుంచి ఉత్తరాలు వచ్చేవి.

"ఇంకా బతికి ఉన్నాడా వాడు? ఎప్పుడో చస్తాడు... అదృష్టం అందలం ఎక్కిస్తే, బుద్ధి బురదలోకి దొర్లిందని ... ఇలాంటి జీవితం వదులుకుని..." ఇలా వాగేవాడు చిన్నకొడుకు.


కచ్చపుట్టేది వింధ్యేశ్వరికి. ఏం చెయ్యాలో తెలియదు. భరత్‌ను తలుచుకుంటే కడుపు చెరువైపోయేది.

అతణ్ణే తలుచుకుని, ఇంత అన్నం కలుపుకువెళ్లి ఆకలేసే పిల్లలకు పెట్టి వచ్చేది. చదువులు చెప్పించేది. భరత్ బట్టలు గుండెలకు ఆనించుకుని మౌనంగా దుఃఖపడేది... ఇవన్నీ అతనికి తెలియాలని ఉత్తరం రాసేది.

"అమ్మా! ఇవన్నీ నీ సహజగుణాలు ... ఇప్పుడు నువ్వు వాటిని గుర్తిస్తున్నావు. ఇంతకాలం, ఇలా ఆలోచించడం నేర్చుకోనంతకాలం నువ్వు నువ్వు కాదు! అందుకే మనం మనని ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. మన జీవితానికి ధన్యత, అర్థం ఉన్నాయా? అని..." ఇలా రాసేవాడు.

కార్గిల్ యుద్ధం ప్రారంభమైంది.

"అమ్మా! భారత్ సైన్యం చేస్తున్న ఈ యుద్ధం ఒక యజ్ఞం. 1965, 1971లో జరిగిన యుద్ధంలాంటిది కాదమ్మా! శత్రువు ఎత్తున ఉంటాడు. మేమూ... కిందనుంచి నిటారుగా ఉన్న ప్రదేశానికి, అలవాటు లేని మంచులో కాళ్లు జారుతూ... ఎప్పుడు ఏ మూలనుంచి తూటా వచ్చి దూసుకుపోతుందో తెలియకుండా నడిచి వెళ్తాం. మేమంతా ముప్పై ఏళ్ల లోపువాళ్లమే! పైగా చాలామందిమి దక్షిణాత్యులమే! ఈ చలి, ఈ తిండి మాకు కొత్త. అమ్మా! భోజనంలోకి అన్నం, చపాతీలు, పప్పు, కాసిని కూరముక్కలు ... టమాటాలు, ఉల్లిపాయలు కనపడితే పండగే! వెంటబడేదానివి 'తినరా, భరత్!' అని. ఇక్కడో... ఏది దొరికితే అదే పరమాన్నం. చాలాసార్లు గుర్తుకు వస్తున్నావమ్మా!




"చీకటిపడ్డప్పుడు... మంచుకొండలమధ్య నక్షత్రాలు మిణుకుమిణుకుమంటూ మరుగున పడిపోయేటప్పుడు ఈ నిశ్శబ్దం కరడుగట్టిన మంచులో గుండెల్లో, వేడి, హాయి కలిగించేదేమిటో తెలుసా అమ్మా... ఎక్కడో అనంత దూరాల్లో ఉన్న నా వాళ్లందర్నీ, నా ప్రజను నేను కాపాడుకుంటున్నా నన్న భావన! వాళ్లముఖంలో వెలిగే సూర్యకాంతిలాంటి చిరునవ్వు! 'అమ్మో! ఈ నా వాళ్లను నేను కాపు కాయకపోతే బానిసలను చేస్తారు. నా దేశం ఆడపిల్లలను అమ్మేస్తారు ... నా పొలాలు, నా పచ్చదనం, నా సంపద కొల్లగొడతారు ... అనుకుంటే చాలు ... రక్తం పొంగుతుంది. ఇంక చలి, శత్రువు, మృత్యువు ఏదీ భయ పెట్టదు!

"రేపు ఉంటామో, లేదో తెలియదు. నిన్న అనేది మరుగున పడింది. ఇప్పటి నిశ్శబ్దం నిజం... అంతే!"

ఆ ఉత్తరం చదివి వెక్కివెక్కి ఏడ్చింది వింధ్యేశ్వరి. అది అందరికీ చదివి వినిపించాలన్న ఆవేశం వచ్చింది కానీ... కానీ... ఎవరు వింటారు? ఎవరికి కావాలి?

ప్రతిరోజూ పేపరు చదివేది. ప్రతి వీరుడిలోనూ భరత్‌ను చూసుకుని ఆ ఫొటోలు ముద్దుపెట్టుకునేది.

మారియప్పన్ శరవణన్, మేజర్ రాజేష్ అధికారి, 29 ఏళ్ల వివేక్ గుప్తా, ముక్కుపచ్చలారని బిడ్డ 22 ఏళ్ల రప్వేందర్... బలైపోయిన వాళ్ల కబుర్లు వింటూంటే గుండెలు తరుక్కుపోయేవి! 'ఒక్క బిడ్డ బలైపోయినా, నా మిగతా బిడ్డల్ని కూడా దేశమాత సేవకు పంపిస్తాను!' అని ప్రతిజ్ఞ చేసే తల్లులను చూసి ఒణికిపోయేది. ఎంత గొప్ప స్త్రీలు వీళ్లు? 'వాళ్ల ఫొటోలు ముద్రించి ప్రతి ఇంటి డ్రాయింగ్‌రూమ్ టేబుల్ మీద పెట్టుకోండి!' అని అరవాలనిపించేది. ఎప్పుడైనా, తను అంతమాట అనగలదా? అయినా, తన మిగిలిన ఇద్దరు కొడుకులు యుద్ధానికి వెళ్తే, శత్రువులతో చేతులు కలిపి, డబ్బు తీసుకుని తనవాళ్లందర్నీ అమ్మేసి వస్తారు.

"ఛ! వెధవలు...!" కచ్చగా తిట్టుకుంటోంది వింధ్యేశ్వరి.

హాల్లో పిచ్చి కేకలు. ఒకపక్క దేశం అట్టుడికిపోతూంటే, అభిమన్యులు వీరమరణం పొందుతుంటే ... వీళ్లకు ఏదీ... ఏదీ పట్టదు!

ఏదో దుష్టసంస్కారం నా దేశాన్ని పట్టుకు పీడిస్తోంది.... కచ్చగా అనుకున్నది వింధ్యేశ్వరి ... వీళ్లవల్ల ఎవరికి ఉపయోగం?! కుటుంబానికా, దేశానికా?

అంతకుముందే వచ్చిన భరత్ ఉత్తరం ...

"అమ్మా! కార్గిల్ ఫండ్‌కు నాన్న, మామయ్య విరాళాలిచ్చారు అని ఆనందిస్తూ రాశావు. పిచ్చి తల్లివే నువ్వు! రాజకీయనాయకుడైన నీ తమ్ముడు, బిజినెస్‌మాన్ అయిన నీ భర్త సంపాదించే ఒక్కరోజు సంపాదన ఇక్కడ ఒక్కొక్క జవాను తీసుకునే సంవత్సర జీతం. నీవాళ్లకు ఇంతకు పదింతలు ఇచ్చినా ఒక్కరోజు లాభం లేకుండా దేశంకోసం మంచులో నిలబడి కాపలా కాస్తారామ్మా నీ మనుషులు? అమ్మా! అందరూ గిల్ట్‌లో బతుకుతున్నారు... బయటపడేందుకు దారులు వెతుకుతారు. పశ్చాత్తాపాలు, ప్రాయశ్చిత్తాలకు ముందు దశ ఒకటున్నదమ్మా! తప్పు చేసేముందు ఆలోచించే దశ ... ఆ దశకు ఈ దేశం ప్రజలు ఎదగాలని మే మిక్కడ ప్రాణాలు పణంగా పెట్టి ప్రార్థనలు చేస్తున్నామమ్మా!"

నిజమే... తనవాళ్లు కాబట్టి కానీ, క్షమించవల్సినవాళ్లేనా వీళ్లు? వీళ్లు దేశం చల్లగా ఉండాలని ఒక్క రోజు ప్రార్థించారా?! అందరూ నావాళ్లు అనుకోగలరా?

కచ్చగా ఉన్నది వింధ్యేశ్వరికి. గుండెల్లో ఏదో మంట... ఎక్కడో ఏదో జరిగిపోతోందన్న బాధ... ఏమిటో తెలియదు.... నాన్నా! భరత్! ఎక్కడున్నావురా? నిస్సహాయంగా అరచేతుల్లో తల దాచుకుని ఏడుస్తోంది ఆ తల్లి.

కాసేపటి తరువాత మౌనంగా ప్రార్థిస్తోంది ... తన బిడ్డకోసమే కాదు, యావత్ సైనిక ప్రపంచం కోసం.

000

పీడ కలలా తెల్లవారింది.

వెలుతురు భయంకరమైన వేదనలతో వచ్చింది. పోలీసులు... కోలాహలం ఏమిటా అని వాకిట్లోకి వచ్చింది.

చిన్నకొడుకును ఎవరో దారుణంగా పొడిచేశారు.

గుండె పగిలిపోయింది వింధ్యేశ్వరికి.


వాడి అందం, అహంకారం అన్నీ సమాధి అయిపోయాయి. ఏం సాధిద్దామని? ఎందుకు ఇంత దుష్టుడైపోయాడు?!

అప్పుడే టెలిగ్రాం.

చిత్రశిలలో భరత్ దహనం చెయ్యబడ్డాడని...

కుప్పకూలిపోయింది వింధ్యేశ్వరి.

తెలివి వచ్చేటప్పటికి ... భర్త ఫోనులో దబాయిస్తున్నాడు ఎవరినో ... గవర్నమెంట్ ఆఫీషియల్స్‌ను కాబోలు కాంపెన్‌సేషన్‌కోసం




అడుగుతున్నాడు. తన బిడ్డ శవం ఇవ్వనందుకు.

శవాన్ని అమ్ముకునే జాతి ... ఒక్క ఉదుటున ఆడపులిలా లేచి రిసీవర్ లాక్కున్నది.

"సారీ! మా వారు అప్‌సెట్ అయ్యారు! నేను తరువాత మాట్లాడతాను!" అని పెట్టేసింది.

"వింధ్యా!" గర్జించాడు భర్త.

"ఏమిటి?" స్థిరంగా చూస్తూ అడిగింది. "ఏం చేస్తున్నారు మీరు? వాడు నా బిడ్డ... భరత్ తన మాతృదేశాన్ని రక్షించుకోడానికి బలైపోతే, వాడి శవం కోసం కాంపెన్సేషన్ అడుగుతున్నారా? ముక్కుపచ్చలారని యువకిశోరాలన్నీ మీలాంటివాళ్లను కాపాడటానికి బలైపోతున్నారంటే అసహ్యంగా ఉంది. అసలు వాడిని మీకు కన్నందుకు కచ్చగా ఉన్నది నాకు!"

ఎప్పుడూ చూడని ఆ మనిషిలోని మనిషిని చూసి భయపడ్డాడు భర్త.

"అందుకు కాదు, వాడి శవానికి మనం కొరివి..."

"కొరివేగా... పెట్టండి! మీ సరదా తీర్చడానికి మీ రెండో కొడుకు శవమై వాకిట్లో ఉన్నాడుగా! వాడిని సరిగ్గా పెంచక దేశానికి వాణ్ణి కొరివిగా చేశాము. చాలు ...! వాడి పక్కన పవిత్రమైన భరత్ శవం ఒకవేళ ఉన్నా, పెట్టి అపవిత్రం చెయ్యొద్దు!"

"వింధ్యా! ఇద్దరూ నీ పిల్లలే! అవునా?"

"అయితే? ... వాడూ, వీడూ ఒకటి కాదు. ఎప్పటికీ కాదు. ఈ దేశంలో జరిగే అన్ని చావులూ ఒకటి కావు... కాకూడదు! భరత్‌కు లక్ష్యం ఉన్నది, ఆదర్శం ఉన్నది. అడుగు, మాట తూచి వేసేవాడు. గుండెల్లో పవిత్రమైన ఆలోచనలు, కళ్లల్లో తేజస్సు ఉండేవి. వీడికి ... ఈ వెధవకు ఏమున్నాయండీ? ఏముండేటట్లు పెంచాం మనం?! దేశమంతా నా భరత్‌కు జోహార్ అంటూంటే, వీడికి ... ఈ వెధవ చచ్చినందుకు జాతర్లు చేసుకుంటున్నారు జనం! వీడూ, వాడూ ఒకటెలా అవుతారు?"

అవాక్కై కూర్చుండిపోయాడు భర్త.

ఆ మర్నాడు ఆర్మీ ఆఫీసుకు వెళ్లింది వింధ్యేశ్వరి.

శోకమూర్తిలా ఉన్న ఆ మాతృమూర్తిని ఓదార్చారు అందరూ.

"కాంపెన్‌సేషన్ బీదజవాన్ల బిడ్డలకు భరత్ తరఫున ఇచ్చేయండి!" స్థిరంగా చెప్పి రాసిచ్చేసింది.

"బాబూ! ఒక్క మాట ... చిత్రశిల ఎక్కడున్నది?"

"నైనితాల్‌లోని హల్ద్వానీ లోయలో ఉన్నది. అది అయిదు వందల సంవత్సరాల నాటి స్మశానవాటిక ... ఏమ్మా?" ఆప్యాయంగా అడిగాడు ఒక ఆఫీసర్.

"ఏమీ లేదు, అక్కడనుంచి ఒక గుప్పెడు మన్ను నా బిడ్డకు జ్ఞాపకంగా తెచ్చిపెట్టగలరా?"

"తప్పకుండా!" కదిలిపోయారు ఆఫీసర్లు. ఏదేదో చెప్తూ ఓదార్చారు. ఎంత ఆప్యాయత వాళ్లకు...! భరత్ చెప్పినట్లు ... ఏమిస్తే వస్తుందది? ఎదురుగా బోర్డుమీద కన్నీళ్ల మసక మధ్యనుంచే అక్షరాలు కూడబలుక్కుని చదివింది వింధ్య.

"మీరు ఇళ్లకు తిరిగి వెళ్లేటప్పుడు మా గురించి అందరికీ చెప్పండి. మీ అందరి భవిష్యత్తుకోసం మా వర్తమానాన్ని త్యాగం చేశామని చెప్పండి!"

గభాలున కొంగులో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది వింధ్యేశ్వరి.

"భగవంతుడా! ఈ వీరజవానుల రక్షణ పొందే అర్హత ఈ నా ప్రజలకు కలిగించు!" అని ప్రార్థిస్తోంది కన్నీళ్లతో.

■